

● వేధించి.. హింసించి.. కేసులు పెట్టిన

పోలీసు సార్లు ఎవరెక్కడున్నారు?



(చిత్తూరు, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వానికి పోలీసులు విశ్వాసపాత్రంగా ఉండడం సహజమే. అయితే అయిదేళ్లపాటు ఒక రాజకీయపార్టీకి బంటుల్లా వ్యవహరించడమే విచిత్రం. జిల్లాలో పోలీసు బాస్ మొదలు ఎస్ఐల దాకా అనేకమంది ఇలా వైసీపీ నాయకుల అడుగులకు మడుగులెత్తారు. వారు ఏమి చెబితే అదే చేశారు. వైసీపీ ప్రత్యర్థులైన వారిని అడ్డుకున్నారు. కొట్టారు. కేసులు పెట్టారు. అరెస్టులు చేశారు. భయభ్రాంతులకు గురిచేశారు. ఐదేళ్లు ఈ అరాచకత్వమే రాజ్యమేలింది. ప్రజల తీర్పుతో జగన్ పార్టీ ఊడ్చుకుపోయింది. తమను వేధించిన, హింసించిన, అక్రమకేసులు పెట్టిన పోలీసు అధికారులు ఇప్పుడు ఏమయ్యారు.. ఎక్కడున్నారు అనే ఆసక్తి బాధితుల్లోనూ, ప్రజల్లోనూ ఉంది. అధికారం మారగానే ప్లేటు మార్చడంలో ఘనులైన కొందరు జిల్లాలోనే ఉన్నారు. కొందరు బదిలీ అయ్యారు. మరి కొందరు వీఆర్‌లో ఉన్నారు. ఆ వివరాలు ఇవీ..

ఆ ముగ్గురూ ప్రత్యేకం

నాటి ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ గంగిరెడ్డి ఈ ముగ్గురూ రాష్ట్రవ్యాప్తంగా అరాచక అధికారులుగా ముద్ర పడ్డారు. వైసీపీకి, పెద్దిరెడ్డికి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టారు. అక్రమ కేసులతో వేధించారు. రిషాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి కుప్పంలో చంద్రబాబును అడ్డుకున్నారు. లోకేశ్ యువగళం పాదయాత్రకు అడ్డంకులు సృష్టించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రిషాంత్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వకుండా హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. సుధాకర్‌రెడ్డి ఎన్నికలకు ముందు అనంతపురం ఏసీబీ డీఎస్పీగా వెళ్లారు. పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడిగా ముద్ర వేసుకున్న సీఐ గంగిరెడ్డిని ఎన్నికలకు కొన్నాళ్ల ముందు పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేశారు.

పెద్దిరెడ్డి రాజ్యంలో పనిచేసినవారెక్కడ?

పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డిని ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా పోలీసులు పనిచేశారు. గతంలో చౌడేపల్లెలో పనిచేసిన సీఐ మధుసూదన్‌రెడ్డి ఇప్పుడు కర్నూలులో ఉన్నారు. కల్లూరు సీఐగా పనిచేసిన శ్రీనివాసులు ఇప్పుడు చిత్తూరు వీఆర్‌లో ఉన్నారు. పుంగనూరు, రొంపిచెర్ల ఎస్ఐగా పనిచేసిన సుకుమార్ మెడికల్ లీవుపై వెళ్లారు. చౌడేపల్లె ఎస్ఐగా పనిచేసిన రవికుమార్ ఇప్పుడు మదనపల్లెలో ఉన్నారు. సోమల ఎస్ఐగా పనిచేసిన నరసింహులు ఇటీవల పలమనేరుకు బదిలీ అయ్యారు. సదుం ఎస్ఐ మారుతి పోలింగ్ ముందు సస్పెండయ్యారు. ఏకపక్షంగా పనిచేసిన చౌడేపల్లె సీఐ కృష్ణారెడ్డిని తాజాగా ప్రభుత్వం వీఆర్‌కు పంపింది.

పలమనేరులో..

పలమనేరు సీఐ చంద్రశేఖర్ వైసీపీ హయాంలో ఇసుక అక్రమ రవాణాకు సహకరించారనే ఆరోపణలున్నాయి. ఇటీవల అయన ఇసుక తీసుకెళ్తున్న టీడీపీ నేతను ఇబ్బంది పెట్టడంతో సుమారు వంద మంది శ్రేణులు రోడ్డుపై ధర్నా చేశారు. తాజాగా అయన్ను వీఆర్‌కు బదిలీ చేశారు. వికోటలో ఏకపక్షంగా పనిచేసి టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టిన సీఐ లింగప్పను చిత్తూరు వీఆర్‌కు మార్చారు. పెద్దపంజాణి మండలంలో వైసీపీతో అంటకాగిన ఎస్ఐ శ్రీనివాసులు ఎన్నికల తర్వాత వీఆర్‌కు వెళ్లారు. గంగవరం సీఐ చిన్నగోవిందు ఏకపక్షంగా పనిచేశారనే ఆరోపణల నేపథ్యంలో తాజాగా వీఆర్‌కు మార్చారు.

కుప్పంలో అరాచక పోలీసుల జాడేది?

కుప్పం నియోజకవర్గంలోనూ పోలీసులు ఏకపక్షంగా పనిచేశారు. టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టారు. వైసీపీతో అంటకాగిన కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్‌ను వీఆర్‌కు పంపించారు. రామకుప్పం, బైరెడ్డిపల్లె ఎస్ఐగా పనిచేసిన కృష్ణయ్య వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి టీడీపీ శ్రేణుల మీద అక్రమ కేసులు పెట్టారు. తాజాగా ఆయన్ను వీఆర్‌కు బదిలీ చేశారు. కృష్ణయ్య రామకుప్పంలో ఓ టీడీపీ కార్యకర్తను బూతులు తిట్టిన ఆడియో అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈయన తర్వాత రామకుప్పం వచ్చిన ఎస్ఐ శివకుమార్ కూడా ఏకపక్షంగా వ్యవహరించారు. ఇలాగే వ్యవహరించిన శాంతిపురం మండలంలోని రాళ్లబుదుగూరు ఎస్ఐ సుమన్‌ను వీఆర్‌కు పంపించారు.

రోజాకి వీరవిధేయులు

నగరి సీఐగా పనిచేసిన శ్రీనివాసంతి మాజీ మంత్రి రోజాకు అనుకూలంగా పనిచేసి టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టారు. రోజాకు తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ ఆధ్వర్యంలో మహిళలు చీర ఇవ్వడానికి వెళ్లినప్పుడు ఈ సీఐ అడ్డుకుని.. అరెస్టు చేసి జైలుకు పంపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ చిత్తూరులో పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాది నుంచి నగరి సీఐగా పనిచేస్తున్న సురేష్ ఎన్నికల సమయంలో ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. గాలి భానుప్రకాష్ మీద అప్పట్లో దాడి జరిగినా, కేసులు పెట్టలేదు. తాజాగా ఈయన్ను కూడా చిత్తూరు వీఆర్‌కు మార్చారు. తవణంపల్లె ఎస్ఐ సుధాకర్‌రెడ్డి వైసీపీ కోసం పనిచేశారు. ఎన్నికల తర్వాత ఆయనే లాంగ్ లీవు పెట్టి వెళ్లిపోయారు.

ఎస్ బాస్‌లు.. ఈ అధికారులు

గుడిపాల ఎస్ఐగా పనిచేసిన శ్రీనివాసులు ఎన్నికల సమయంలో ఏకపక్షంగా వ్యవహరించి, లాఅండ్‌ఆర్డర్ తప్పేలా చేయడంతో ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండు చేశారు. ఎస్ఆర్‌పురం ఎస్ఐగా 2022-23 మధ్యలో పనిచేసిన శ్రీనివాసులు నారాయణస్వామికి, విజయానందరెడ్డికి అనుకూలంగా వ్యవహరించి రెండుసార్లు వీఆర్‌కు వెళ్లారు. నాయుడుపేట నుంచి చిత్తూరుకు ఎన్నికల ముందు వచ్చిన డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి వైసీపీ కోసం పనిచేశారు. తాజాగా ఆయన్ను పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. చిత్తూరు వన్‌టౌన్, టూ టౌన్, వెస్ట్ సీఐలు విశ్వనాథ్‌రెడ్డి, ఉలసయ్య, రవిశంకర్‌రెడ్డితో పాటు తాలుకా, బీఎన్ఆర్‌పేట ఎస్ఐలు ఉమామహేశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మను ప్రభుత్వం తాజాగా వీఆర్‌కు పంపింది. వీరిలో విశ్వనాథ్‌రెడ్డి మాత్రం అన్నమయ్య జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సీఐగా పోస్టింగ్ తెచ్చుకున్నారు. పాలసముద్రం ఎస్ఐ భారతి ఎన్నికల సమయంలో వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. పాత కేసులున్న టీడీపీ శ్రేణుల్ని మాత్రమే బైండోవర్ చేశారు. జీడీనెల్లూరు పోలీస్‌స్టేషనులో ఏఎస్ఐ ఆంజనేయులురెడ్డి, గజేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ వైసీపీ నేత విజయానందరెడ్డికి అనుకూలంగా ఉంటూ స్టేషనులో జరిగే విషయాల్ని ఎప్పటికప్పుడు ఆయనకు చేరవేసేవారనే ప్రచారం ఉంది. ఎన్నికలకు ముందు పెనుమూరు వచ్చిన ఎస్ఐ లోకేశ్ మీద ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపించారు. ఏకపక్షంగా వ్యవహరించిన కార్వేటినగరం సీఐ సత్యబాబును తాజాగా వీఆర్‌కు బదిలీ చేశారు.

ఒక్క ఎంపీడీవోకు తప్పనిసరి

● మిగిలిన వారు నిబంధనల మేరకు బదిలీ

చిత్తూరు రూరల్, ఆగస్టు 20: జడ్పీలో బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఐదేళ్ల పాటు ఒకే చోట విధులు నిర్వహించిన వారి వివరాలను అధికారులు సేకరించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 65 మండలాలుంటే అందులో 48 మండలాలకు రెగ్యూలర్ ఎంపీడీవోలు ఉండగా మిగిలిన 17 మండలాలకు ఈవోఆర్డీలు, ఏవోలు ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ 48 మంది ఎంపీడీవోల్లో పుత్తూరు ఎంపీడీవో ఇందిరమ్మ మాత్రం ఒకే మండలంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. దీంతో ఆమెకు బదిలీ అనివార్యమైంది. మిగిలిన వారు రెండు నుంచి నాలుగేళ్ల వరకు సర్వీసులు పూర్తి చేసుకున్నారు. వీరిని ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు బదిలీ చేయనున్నట్లు సీఈవో గ్లోరియా తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలోని పంచాయతీరాజ్‌లో మొత్తం ఏడుగురు డీఈలకు గాను ఇద్దరు ఐదేళ్ల సర్వీసులు పూర్తి చేసుకున్నారు. 14 మంది ఏఈలకు గాను 8 మంది.. ఆర్‌డబ్ల్యూఎస్‌లో 10 మంది డీఈలకు గాను ఇద్దరు.. 41 మంది ఏఈల్లో 10 మంది =ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. జడ్పీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు 150 మంది ఐదేళ్ల పూర్తి చేసుకోవడంతో వీరందరికి బదిలీ తప్పదు.

వెబ్‌సైట్‌లో ఐసీడీఎస్ పోస్టుల అర్హుల వివరాలు

● 23న ఎస్వీసెట్ కళాశాలలో కంప్యూటర్ పరీక్ష

చిత్తూరు, ఆగస్టు 20: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఖాళీ పోస్టుల కోసం వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేసి, అర్హుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామని ఆ శాఖ పీడీ నాగశైలజ తెలిపారు. జ్టిఇ//ఛిజిజ్జ్టీాట్ుఇఃజౌెరి.జీ వెబ్‌సైట్‌లో వివరాలు ఉన్నాయని, వారికి కంప్యూటర్ పరీక్ష ఈ నెల 23వ తేదీ తిరుపతి రోడ్డు ముత్తిరేవుల వద్ద ఉన్న ఎస్వీసెట్ కళాశాలలో జరుగుతుందని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. ఒరిజనల్ ఆధార్ లేదా ఓటరు కార్డు తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.





వైసీపీ నేతల పాలైన ఆవులమావులకొండ భూములు

మా భూములు కాపాడండి

● మాకు రక్షణ కల్పించండి

● సదుంలో వైసీపీ కార్యకర్త ఆగడాలపై ఎస్పీకి వృద్ధ జంట ఫిర్యాదు

పుంగనూరు, ఆగస్టు 20: 'భూమికి సంబంధించి డాక్యుమెంట్లు లేకుండానే వైసీపీ కార్యకర్త అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నాడు. 50 మంది రౌడీలతో పొలంలోకి వచ్చి దౌర్జన్యం చేశాడు. మా భూములను కాపాడి.. మా ప్రాణాలకు రక్షణ కల్పించండి' అంటూ ఓ వృద్ధ జంట మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశామని సదుం మండలం ఊటుపల్లె గ్రామం తుమ్మగుంటపల్లెకి చెందిన వి.నాగరాజ (68), ఆయన భార్య కృష్ణమ్మ తెలిపారు. 'మా భూమిని ఊటుపల్లెకి చెందిన వైసీపీ కార్యకర్త టి.లక్ష్మిరెడ్డి కుమారుడు టి.సిద్ధారెడ్డి తప్పుడు రికార్డులతో కలికిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2008లో రిజిస్టర్ చేసుకున్నాడు. గ్రామంలో వైసీపీ వారు అధికంగా ఉండటంతో మేము వారికి ఎదురు తిరగలేక, న్యాయం కోసం కోర్టును ఆశ్రయించాం. కృష్ణమ్మ, కుమారుడు వెంకట్రమణ పేర్లతో మూడేసి వంతున ఆరు ఎకరాలు ఉండగా. సిద్ధారెడ్డి దౌర్జన్యంగా భూమిలోకి ప్రవేశించి బోరు స్టార్టర్ తొలగించి పైపులు పగలకొట్టాడు. వారం కిందట వైసీపీ కార్యకర్తలు సిద్ధారెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి, విక్రంరెడ్డి, సురేంద్రరెడ్డి, మరో 50 మంది రౌడీలు కోర్టులో కేసు నడుస్తున్న భూమిలోకి మూడు ట్రాక్టర్లతో వచ్చారు. పొలం దున్ని ఉలవలు చల్లారు. మాకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే.. మాపైనే ఎస్ఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సోమవారం చిత్తూరు ఎస్పీ మణికంఠకు జరిగిన విషయాన్ని విన్నవించి ఆ భూమిని కాపాడి, మాప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరాం. దీనిపై విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు' అని బాధితులు తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో పలమనేరు డీఎస్పీ, పుంగనూరు రూరల్ సీఐలకు ఫిర్యాదులు చేశామన్నారు.



రక్షణ కల్పించాలని కోరుతున్న నాగరాజ, కృష్ణమ్మ

మేత భూమిని మేసేశారు!

అది పశువులకు మేత భూమి. యానాదులకు జీవనాధారమైన అటవీ ఫలసాయం దొరికే ప్రాంతం. అలాంటి భూముల్లో 99 ఎకరాలను భూ పంపిణీ పేరిట వైసీపీ నేత, రెవెన్యూ అధికారులు కలిసి పంచేశారు. ఈ భూములు పొందిన వారిలో అత్యధికులు అనర్హులు.. స్థానికేతరులే. భవిష్యత్తులో ఈ భూమి విలువ పెరుగుతుందంటూ రేటుపెట్టి అమ్మేసినట్లు ఆరోపణలున్నాయి.

- బంగారుపాళ్యం

● భూ పంపిణీ పేరిట 99 ఎకరాల పంపకం

● అత్యధికులు అనర్హులే

● భారీగా నగదు వసూళ్లు

● ఎన్నికల ముందు వైసీపీ నేత, రెవెన్యూ అధికారుల తంతు

బంగారుపాళ్యం మండలం మొగిలి రెవెన్యూ పరిధిలోని మొగిలివారిపల్లె పంచాయతీ రెవెన్యూ దాఖలా 165, సర్వేనెంబరు 135లో 370 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిని 'ఆవులమావులకొండ' అని పిలుస్తారు. ఈ భూముల్లో జయంతి యానాది కాలనీ, మొగిలివారిపల్లె, బలిజపల్లె, గాండ్లపల్లె, మొగిలి, గౌరిశంకరాపురం తదితర గ్రామాల వారు ఆవులు, మేకలను మేపుకొనేవారు. జయంతియానాది కాలనీకి చెందిన యానాదులు ఈ అటవీ ప్రాంతంలో తేనె తీసుకుని.. కట్టెలు కొట్టి అమ్ముకోవడం.. అటవీ ఫలసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ భూములపై ఆ పార్టీ నేత కన్నుపడింది. ఈ భూములను పంపిణీ చేయడం ద్వారా డబ్బు సంపాదించాలని ఓ వైసీపీ నేత భావించారు. అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో సార్వత్రిక ఎన్నికలకు ముందు దీనికి 'స్కెచ్' వేశారు. ఉన్నతాధికారులు ఎన్నికల హడావిడిలో ఉంటే.. వీళ్లేమో ఈ భూముల పంపిణీ పేరిట వసూళ్లకు శ్రీకారం చుట్టారు. భూ పంపిణీ ఫైళ్లను సిద్ధం చేస్తున్న విషయం తెలిసి స్థానికులు అభ్యంతరం తెలిపారు. పశువుల మేతకు, ఇతర అవసరాలకు భూమి కావాలని, దీనిని పంపిణీ చేయొద్దంటూ ఆర్డీవో, కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అయినా, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో రైతులంతా చందాలు వేసుకుని హైకోర్టుకు వెళ్లి ఇంటీరియం స్టే తీసుకొచ్చినా రెవెన్యూ అధికారులు లెక్క చేయలేదు. భూ పంపిణీకి చైర్మన్‌గా ఉన్న అప్పటి ఎమ్మెల్యేకి.. ఓ మంత్రి ద్వారా చెప్పించి సంతకం చేయించినట్లు తెలిసింది. దీని వెనుక ఓ వైసీపీ నేత కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం.

99 ఎకరాలు ఇచ్చేశారు

మొత్తమ్మీద 'ఆవులమావులకొండ'లో 99 ఎకరాలకు పట్టాలు సిద్ధం చేశారు. ఎక్కువమంది స్థానికేతరులైన వైసీపీ సానుభూతిపరులకే పంపిణీ చేశారు. ఎక్స్‌ప్రెస్ హైవే వల్ల ఈ భూముల విలువ అమాంతం పెరుగుతాయంటూ.. ఎకరాకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఆర్థికంగా ఉన్న వారి వద్ద రూ.రెండు లక్షల వరకు తీసుకున్నారని రెవెన్యూ వర్గాలే చెబుతుండటం విశేషం. ఈ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ నేత.. రెవెన్యూ అధికారులు ఈ మొత్తాన్ని పంచుకున్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. ఈ భూముల పంపిణీపై సమగ్ర విచారణ జరపాలని శనివారం జరిగిన బంగారుపాళ్యం మండల సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే మురళీమోహన్‌కు మొగిలివారిపల్లె, జయంతియానాది కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

యానాదులకు సెంటు భూమి ఇవ్వలేదు



తరతరాలుగా అటవీఫలసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న మాకు అధికారులు అన్యాయం చేశారు. మొత్తం భూమిలో వైసీపీ సానుభూతిపరులైన ఒకరిద్దరు ఎస్టీలకు ఎకరం చొప్పున భూములిచ్చి, మిగిలిన వీటిని చుట్టుపక్కల వారికి పంపిణీ చేశారు. ఇదంతా అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్, వైసీపీ నేత కలిసే చేశారు.

- మునిరాజ, జయంతి యానాది కాలనీ

అర్హులకు సెంటు కూడా ఇవ్వలేదు



డబ్బులకు ఆశపడిన అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్, వైసీపీ నేత కలిసి ప్రభుత్వ భూములను పంపిణీ చేశారు. అటవీఫలసాయం, మేకలు, ఆవులు మేపుకునే జయంతి ఎస్టీకాలనీ వాసులను మోసం చేశారు. ఎక్కడో బంగారుపాళ్యంలో ఉన్న వైసీపీ నేతలు, సానుభూతిపరులకే భూములను పంపిణీ చేశారు. అర్హులకు సెంటు కూడా ఇవ్వలేదు.

- బాలసుబ్రహ్మణ్యం, మొగిలివారిపల్లె

అరటి చెట్టు మధ్యలో గెల



గుడిపాల, ఆగస్టు 20: సాధారణంగా అరటి చెట్టుకు కొనభాగంలో గెలలు వస్తుంటాయి. మండలంలోని 197 రామాపురం దళితవాడకు చెందిన వేదమాణిక్యం ఇంటివద్ద అరటి చెట్టులో కాండం మధ్యలో గెల రావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. దీన్ని చుట్టుపక్కల జనం వింతగా చూస్తున్నారు.

సీనియారిటీ జాబితా పరిశీలన



ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 20: విద్యాశాఖ అధికారులు మున్సిపల్ టీచర్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ టీచర్ల జాబితా పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం హసన్‌బాషా ఆధ్వర్యంలో ల్యాంగ్వేజ్ ఎస్జీటీ (తెలుగు, హిందీ) టీచర్ల స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి నిమిత్తం ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేశారు.

● **కొనసాగుతున్న టీచర్ల సర్దుబాటు :** ఉమ్మడి చిత్తూరు జిల్లా టీచర్ల సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. పీపుల్ టీచర్ రేషియో (పీటీఐ) ఆధారంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 743 మంది టీచర్లు సర్‌ప్లస్‌గా ఉన్నట్లు గుర్తించారు. తొలి దశలో స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ) ల్యాంగ్వేజ్ (తెలుగు, హిందీ) టీచర్ల సర్దుబాటు ప్రక్రియను మంగళవారం నాటికి పూర్తి చేశారు. తదుపరి సబ్జెక్టు, ఆపై ఎస్జీటీల సర్దుబాట్లు చేపట్టనున్నారు.

ఏర్పేడు సీఐపై ఎస్పీ సీరియస్

● నెంబర్‌గేమ్ ఆటగాళ్లపై చర్యలు తీసుకోలేదంటూ ఆగ్రహం

ఏర్పేడు, ఆగస్టు 20 : ఏర్పేడు మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోకపోవడం పట్ల సీఐ శ్రీరామ శ్రీనివాసులుపై ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్ అయినట్లు సమాచారం. పాపానాయుడుపేటలో ఏటా ఆగస్టు మాసంలో నిర్వహించే ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి జనం హాజరవుతుంటారు.వీరిలో కొంతమంది డబ్బాలో చింతగింజలు పోసి ఆడే నెంబర్‌గేమ్ అనే ఆటను లక్షల రూపాయలు బెట్టింగ్ పెట్టి ఆడుతుంటారు.పోలీసులు నిఘా వుంచి చర్యలు తీసుకుంటుంటారు. ఈసారి పదిరోజులుగా జరుగుతున్న ధర్మరాజుల స్వామి ఉత్సవాల్లో కూడా నెంబర్‌గేమ్ నడుస్తోంది. ఈ ఆట ఆడేవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు వారం రోజుల క్రితమే సీఐ శ్రీరామ శ్రీనివాసులును ఆదేశించారు.అయితే నెంబర్‌గేమ్ నిర్వాహకులతో కుమ్మక్కైన సీఐ అలాంటిదేమీ జరగడం లేదని ఎస్పీ కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు.అయితే నెంబర్‌గేమ్ జోరుగా సాగుతోందన్న సమాచారంతో రేణిగుంట డీఎస్పీకి చర్యలు తీసుకోమని ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రత్యేక నిఘా వుంచి నెంబర్‌గేమ్ ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.13,850 స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ శ్రీరామ శ్రీనివాసులుపై ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం.స్టేషన్‌కు సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన వారితో కూడా సీఐ అగౌరవంగా మాట్లాడుతున్నాడన్న ఆరోపణలున్నాయి.ఈ నేపథ్యంలో సీఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని సమాచారం.



● రెడ్డెప్ప రెడ్డిపై ప్రధాన ఆరోపణలివే...



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బర్డ్‌లో ఇంప్లాంట్స్ కొనుగోలుకు కూడా రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. ఐదారు కంపెనీలు అర్హత సాధించినా ఒక కంపెనీకే ప్రాధాన్యం ఇవ్వడం, అదికూడా రూ.5వేల ధర ఎక్కువ ఉన్న ఇంప్లాంట్లను కొనుగోలు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం మూడు నెలల్లో ఆ కంపెనీకి చెందిన 366 ఇంప్లాంట్లను అమర్చారు. తక్కిన కంపెనీలవి 50లోపే వినియోగించారు.నాణ్యత లేకపోయినా, టెండరులో ఎక్కువ ధర ఉన్న ఇంప్లాంట్లనే కమీషన్ల కోసం వినియోగించారన్న అనుమానాలున్నాయి. బర్డ్‌లో కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న దాదాపు 17మంది ఆర్థోపెడిక్ సర్జన్లను నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ చేశారని, దీనివెనుక పెద్దఎత్తున నగదు చేతులు మారినట్టు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లతో మాట్లాడుకుని అక్కడ రూ.ఐదారు లక్షలయ్యే ఆపరేషన్ తిరుపతిలో అదే వైద్యులతో రెండు,మూడు లక్ష రూపాయలతోనే చేసేస్తామని బర్డ్‌కు తీసుకొచ్చి శస్త్ర చికిత్సలను చేసి పంపినట్టు తెలుస్తోంది. ఆయా ఆస్పత్రి వైద్యులను ఇక్కడికి గెస్ట్ డాక్టర్లుగా పిలిపించుకుని వారితో ఉచితంగా సర్జరీలు చేయించి శ్రీవారి ప్రోటోకాల్ దర్శనం చేసి పంపేవారన్న ఆరోపణలున్నాయి.

బర్డ్‌ను భ్రష్టుపట్టించారు!

ప్రత్యేకాధికారి రెడ్డెప్ప రెడ్డిపై అవినీతి ఆరోపణలు

ఇంప్లాంట్ల కొనుగోలులో అవినీతి వెలుగులోకి

రికార్డులు స్వాధీనం చేసుకున్న స్టేట్ విజిలెన్స్

తిరుపతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆర్థోపెడిక్ ఆస్పత్రి.అంతేకాదు మూడున్నర దశాబ్దాలుగా లక్షలాదిమంది జీవితాలలో వెలుగులు నింపిన దవాఖానా. అయితే గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను, సంస్థలను నాశనం చేసినట్టే తిరుపతిలోని ప్రసిద్ధ వైద్య విజ్ఞాన సంస్థ బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్)ను కూడా భ్రష్టు పట్టించేసింది. తెల్ల రేషన్ కార్డుంటే పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు దొరికిన చోట ప్యాకేజీలు పెట్టి బేరాలాడారు. అడుగడుగునా రాజకీయ ప్రమేయం పెరిగిపోయింది. వైసీపీ నేతలు సిఫార్సు చేసిన వారికే కీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసేవారన్న ఆరోపణలొచ్చిన క్రమంలో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వైసీపీ హయాంలో బర్డ్‌లో ప్రత్యేకాధికారిగా చేరి డైరెక్టర్‌గా చెలామణి అయిన డాక్టర్ రెడ్డెప్ప రెడ్డిపై ఇటీవల ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టిపెట్టింది. ఆయన ఘనకార్యాలకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు మంగళవారం బర్డ్‌కు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

టీటీడీ నిర్వహణలో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న బర్డ్ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి గతి తప్పిపోయింది. బర్డ్‌కు కొత్త రెక్కలు తొడుగుతామని చెప్పుకొచ్చిన అప్పటి టీటీడీ అధికారులు సైతం రాజకీయ నాయకుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. తాజా మాజీ డైరెక్టర్ డాక్టర్ రెడ్డెప్ప రెడ్డిపై నిధుల దుర్వినియోగంతో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి నెలరోజుల క్రితం పెద్దఎత్తున ఫిర్యాదులందాయి. దీంతో రెడ్డెప్ప రెడ్డిని విచారణకు అనుమతించాలని గత నెలలో విజిలెన్స్ అధికారుల నుంచి టీటీడీ అధికారులకు మెమో జారీఅయింది. బర్డ్‌లో ఆయనకు విపరీతమైన అధికారాలు ఎవరిచ్చారు? ఇంప్లాంట్ల కొనుగోలులో ఆయన పాటించిన మార్గదర్శకాలు ఏమిటి? నోటిఫికేషన్ లేకుండా వైద్యులను ఎలా రెగ్యులర్ చేశారు? వైసీపీ సిఫారసు లేఖలతో కీళ్ల మార్పిడి కేసులు ఎన్ని చేశారు? తదితరాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టినట్టు తెలిసింది.

● ఎవరీ రెడ్డెప్ప రెడ్డి?

అనస్థీషియాలో డిప్లొమా చేసిన రెడ్డెప్ప రెడ్డి వైసీపీ నేతల అండదండలతో 2021లో బర్డ్ ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. బర్డ్‌లో అప్పటివరకు లేని ప్రత్యేకాధికారి పోస్టును ఆయనకోసమే అప్పటి టీటీడీ పెద్దలు సృష్టించారు. వైసీపీ పెద్దల ఆశీస్సులతో బర్డ్‌లో రెడ్డెప్ప రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అపోలో హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి గౌరవ డైరెక్టర్‌గా కొంత కాలం కొనసాగి తప్పుకున్నాక రెడ్డెప్ప రెడ్డి బర్డ్‌ను తనచుట్టూ తిప్పుకున్నారు. వైసీపీ నేతల సిఫారసు లేఖలకే కీళ్ల మార్పిడిలో ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా రాజంపేట వైసీపీ నేత ఆకేపాటి అమరనాథ రెడ్డి ఇంట్లో బర్డ్ వైద్యబృందంతో వెళ్లి మెడికల్ క్యాంప్ నిర్వహించినట్టు తెలిసింది. మే 31న అధికారికంగా రెడ్డెప్పరెడ్డి బర్డ్ ప్రత్యేకాధికారిగా రాజీనామా చేశారు. అయితే మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందన్న ఆశతో జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకు బర్డ్ డైరెక్టర్ బంగ్లాలోనే ఉన్నారు. ఆయన అంచనాలు తారుమారు కావడంతో బంగ్లా ఖాళీ చేసి జూన్ 6న హైదరాబాద్‌కు వెళ్లిపోయి, అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సీఈవోగా చేరినట్టు సమాచారం.

సర్వీసు రోడ్డు వేయాలని ధర్నా

● ఎమ్మెల్యే చొరవతో సమస్యకు పరిష్కారం



సర్వీసు రోడ్డు కోసం ధర్నా చేస్తున్న గ్రామస్తులు, రైతులు

నిండ్ర, ఆగస్టు 20: అత్తూరు దళితవాడ వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, రైతులు బెంగళూరు-తచ్చూర్ హైవేపై మంగళవారం ధర్నా నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి వాడే వాహనాలను నిలిపివేశారు. హైవే నిర్మాణంలో భాగంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. రోడ్డు ఎత్తు పెంచడంతో పంటలు నీటి మునుగుతున్నాయని చెప్పారు. బ్రిడ్జికి అవతల 1,300 ఎకరాల్లో నీరు చేరుతున్నాయని చెప్పారు. జీఎస్‌కండ్రిగ గ్రామానికి దారిలేక ఈదుకుంటూ వెళ్లాల్సి వస్తోందన్నారు. గతంలో ఉన్న ఆర్‌డీవో, తహసీల్దార్‌కు విన్నవిస్తే ఇరువైపులా సర్వీసు రోడ్డు, శ్మశానికి దారి కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఈ లోపల వారు బదిలీపై వెళ్లారని తెలిపారు. హైవే పనులు పూర్తి కావస్తున్నా సర్వీసు రోడ్డు మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించేది లేదన్నారు. సమాచారం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ హైవే కాంట్రాక్టర్లతో చర్చించి పది రోజుల్లో సర్వీసు రోడ్డు, శ్మశానం ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 20: రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీవో) బలోపేతానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. మెరుగైన, నాణ్యమైన వస్తువుల ఉత్పత్తికి, సాంకేతికతకు రైతులను ఎఫ్‌పీవోలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. రైతులు పండించే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే అంశంపై త్వరలో వారికి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పాలు, కూరగాయలు, మామిడితో పాటు ఉద్యాన పంటల సాగు, మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని చెప్పారు. ఎఫ్‌పీవోల పరిధిలో లైసెన్సు మంజూరులో పెండింగ్ ఉంచరాదన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, నాబార్డు డీడీఎం సునీల్ కుమార్, వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

పెద్దపంజాణి, ఆగస్టు 20: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం బైరెడ్డిపల్లె - పుంగనూరు రోడ్డు పెద్దవెలగటూరు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. గంగవరం మండలం దండపల్లె గ్రామానికి చెందిన మురళి, రమేష్‌లు కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంలో 96 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కాగా ఇదివరకే రమేష్‌పై గంగవరం పోలీస్‌స్టేషన్‌లో మద్యం అక్రమ తరలింపు కేసులు ఉన్నాయి.

పట్టపగలు నిమిషాల్లో దోచేశాడు!

తిరుచానూరు, ఆగస్టు 20: తిరుచానూరులో మంగళవారం ఉదయం 15 నిమిషాల వ్యవధిలో ఓ ఇంట్లో చొరబడ్డ బీరువాలో ఉన్న నగ, నగదు ఎత్తుకెళ్లాడు.పోలీసుల కథనం మేరకు... తిరుచానూరులోని కొత్త వీధిలో భారతి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. పక్కనే టైలరింగ్ షాప్ నడుపుతోంది. ఉదయం 10.30గంటల సమయంలో ఓ వ్యక్తి దర్జాగా మిద్దెపైకి వెళ్లి భారతి ఇల్లు గడియ తొలగించి బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లాడు. కొంత సేపు తరువాత మిద్దె పైకి వెళ్లిన భారతి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడివుండడం గమనించింది.చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, క్లూస్‌టీం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి నిందితుడి వేలిముద్రలను సేకరించారు. సమీపంలోని ఓ పాఠశాలలో ఉన్న వీడియో పుటేజీని పరిశీలించగా ఓ వ్యక్తి దర్జాగా మిద్దెపైకి వెళ్లి దొంగతనం చేసిన దృశ్యాలు లభ్యమైనట్లు తెలిసింది. భారతి ఇంట్లో సుమారు 12 సవర్ల బంగారు నగలు చోరీ జరిగినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

చిత్తూరులో 'యూటర్న్ కష్టాలు'

● ఎమ్మెస్సార్ సర్కిల్‌లో వాహనాలు తిప్పలేక డ్రైవర్ల ఇబ్బందులు ● పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

చిత్తూరు సిటీ, ఆగస్టు 20: చిత్తూరు నగరంలోని ఎమ్మెస్సార్ సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన 'యూటర్న్'తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలూరు వైపు నుంచి చిత్తూరు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే మార్గంలోని ఎమ్మెస్సార్ సర్కిల్ అసలే ఇరుకైన రోడ్డు. ఆ రోడ్డుపైనే డివైడర్లు వేసి యూటర్న్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన యూటర్న్ వల్లే ఎక్కువగా ట్రాఫిక్ జాం అవుతోంది. మరోవైపు వాహనాలు యూటర్న్ తీసేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ.. పాఠశాల, కళాశాల బస్సులు పొడవు ఎక్కువగా ఉండటంతో ఈ మలుపు తిప్పలేక వెనక్కు రావాల్సి వస్తోంది. అదే సమయంలో వెనుక ఉన్న వాహనాలను ఢీకొంటున్నాయి. ఉదయం పాఠశాలకు, ఉద్యోగాలకు వెళ్ళే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్ళే సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ట్రాఫిక్ జాం అవుతోంది. మరోవైపు ఎమ్మెస్సార్ బస్టాప్‌కూడా ఈ యూటర్న్ వద్దే ఉండటంతో బస్సులు ఆపుతుంటారు. బెంగళూరు, మదనపల్లె, పలమనేరు, కుప్పం, యాదమరి, గుడియాత్తం వైపు వెళ్ళే ప్రయాణికులు సైతం ఇక్కడ వేచివుంటారు. వీఐపీలు వచ్చే సమయంలో మాత్రం యూటర్న్ నిబంధనలు సడలించి నేరుగా వాహనాలను వదిలేస్తుంటారు. ఇక్కడ యూటర్న్ తీసివేస్తే ట్రాఫిక్ జాం నియంత్రించడంతోపాటు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని స్థానికులు అంటున్నారు.



యూటర్న్ తిప్పలేక ఇబ్బంది పడుతున్న బస్సు డ్రైవర్





యూటర్న్ తిరుగుతున్న వాహనాలు

టీడీపీ నేత కారును ఢీకొట్టి.. పరారీ





దెబ్బతిన్న టీడీపీనేత కారు - జరిగిన ఘటనను పోలీసులకు వివరిస్తున్న రఘుచంద్ర గుప్తా

బైరెడ్డిపల్లె, ఆగస్టు 20: గంగవరం మండలం నాలుగురోడ్ల సమీపంలో సోమవారం అర్ధరాత్రి టీడీపీ నేత కారును వెనుక నుంచి టెంపో ఢీకొట్టింది. ఆగకుండా వాహనం వెళ్లిపోయింది. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకి చెందిన టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్రగుప్తా మిత్రులతో కలసి తిరువణ్ణామలై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం రాత్రి 12 గంటలకు పలమనేరుకు చేరుకున్నారు. తన మిత్రులను అక్కడ దింపేసి.. కారు నడుపుకుంటూ ఇంటికి బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గంగవరం మండలం నాలుగురోడ్ల సమీపంలోని సర్వీసురోడ్డులో వస్తుండగా ఓ టెంపోవచ్చి కారును వెనుక నుంచి ఢీకొంది.

షాక్‌కు గురైన రఘుచంద్రగుప్తా తేరుకునేలోపు మళ్లీ టెంపో రెండోసారి కారును ఢీకొట్టడంతో భయాందోళనతో రఘుచంద్రగుప్తా గట్టిగా కేకలు వేశారు. టెంపో అక్కడినుంచి వేగంగా వెళ్లిపోయింది. దీనిపై ఆయన గంగవరం పోలీసులకు సమాచారమిచ్చారు. గంగవరం పోలీసులు మంగళవారం సంఘటన జరిగిన ప్రదేశాన్ని, దెబ్బతిన్న కారును పరిశీలించి రఘుచంద్రగుప్తాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడూ లేనిది ఇలాంటి సంఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, పలువురు నేతలు రఘుచంద్రగుప్తాను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో 30న పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 20: ఎస్వీ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 30వ తేదీన ఉదయం 9.30 గంటలకు కళాశాలలోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి నిబంధనల మేరకు ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ(డీఎంఎల్‌టీ) 30 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ (డీఏఎన్ఎస్) 30 సీట్లకు సంబంధించి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు తీసుకురావాలన్నారు. సీటు పొందిన విద్యార్థులు అన్నిరకాల ఫీజులకు సంబంధించి రూ.7,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

హత్యాచార నిందితులను ఉరితీయాలి

పుంగనూరు రూరల్, ఆగస్టు20: కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను నడిరోడ్డుపై ఉరితీయాని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘనాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పుంగనూరులో విద్యార్థులతో కలసి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యురాలు డాక్టర్ మానస, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నాలు తదితరులు ప్రైవేటు బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడుతున్న డాక్టర్ల ప్రాణాలు తీస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఈనెల 9వ తేది ఘటన జరిగితే ఇంతవరకు పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడాలంటే భయపడేలా కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘనాయకులు మోహన్, అసిఫ్, అలీ, సుమంత్‌లతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, వి.కోట, రామకుప్పం తదితర ప్రాంతాల్లోనూ కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. హత్యాచార నిందితులను ఉరి తీయాలని నినదించారు.



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



అధ్వానంగా ఉన్న జగనన్న కాలనీ రోడ్డులో నడిచి వెళ్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వెదురుకుప్పం, ఆగస్టు 20: లే అవుట్లలో ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కార్వేటినగరంలోని పద్మ సరస్సు, కార్వేటినగరం-పచ్చికాపల్లం మార్గంలో ఉన్న లే అవుట్లను తనిఖీ చేశారు. కొత్త కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీలను మంజూరు చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణదారులకు అదనంగా రుణాలు మంజూరు చేయిస్తామని, ఉచితంగా ఇసుక మంజూరు చేస్తామన్నారు. కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ తనిఖీ చేసి శాఖల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణపై ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. ఉద్యోగుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

కార్వేటినగరం మండలంలో ఈ-క్రాప్ ద్వారా పంట నమోదును కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు అలియాస్ నాగరాజు కలెక్టర్‌కు శాలువ కప్పి, మొక్క అందించారు. రేణిగుంట వద్ద ఉన్న షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ భగవతి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి, ఎంఈవో మంచికాయల విజయకుమార్, ఏవో హేమలత, గ్రామ సచివాలయ ఉద్యోగులు కలెక్టర్ వెంట ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో దాతలకు గదుల కేటాయింపు రద్దు

తిరుమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దాతలకు గదుల కేటాయింపు రద్దు చేసినట్టు టీటీడీ తెలిపింది. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈక్రమంలో టీటీడీలోని వివిధ ట్రస్టులకు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు కేటాయించే గదులను రద్దు చేసినట్టు స్పష్టం చేసింది.అక్టోబరు 4న ధ్వజారోహణం, 12న చక్రస్నానం జరిగే రోజులు మినహా మిగతా రోజుల్లో దాతలను దర్శనానికి అనుమతిస్తారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు, ఆగస్టు20: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితే మాలలు తీవ్రంగా నష్టపోతారని, ఏపీలో మాలకులస్తులు అధికంగా ఉన్నారన్నారు. మాల, మాదిగల మధ్య బేదాభిప్రాయాలు సృష్టించడానికి రాజకీయ నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారని వారికి బుద్ది చెప్పడానికి బంద్‌ను విజయవంతం చేయాల్సివుందన్నారు. నాయకులు శ్రీనివాసులు, నాగరాజ, ఆనంద్, భాస్కర్, మాణిక్యం, శీను, వెంకటస్వామి పాల్గొన్నారు.

పంచాయతీలో ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం



డీపీవో నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న కార్యదర్శి శివశంకర్

గుడుపల్లె, ఆగస్టు 20: మండలంలోని యామగానిపల్లె పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌కు పంచాయతీలో ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకొన్నారు. శివశంకర్‌ను ఎంపీడీవో తాజ్ మస్రూర్, మండల అధికారులు, కార్యదర్శులు సిబ్బంది అభినందించారు.

ద్రావిడ వర్సిటీకి టీటీడీ నిధులందించండి



ఈవోకు పుష్పగుచ్చం అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

గుడుపల్లె, ఆగస్టు 20: ద్రావిడ వర్సిటీకి ప్రతి ఏటా టీటీడీ ద్వారా అందించే నిధులను రెండు సంవత్సరాలుగా అందించలేదని వాటిని అందించాలని ఈవో శ్యామలారావును ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ కోరారు. మంగళవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన్ను కలిశారు. ఆ నిధులను తిరిగి పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. పాలక మండలి సమావేశంలో చర్చించి నిధులు విడుదలకు కృషి చేస్తానని ఈవో తెలిపినట్లు వీసీ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కెంపసముద్రం విద్యార్థిని వాణిశ్రీ



రామకుప్పం, ఆగస్టు 20: రామకుప్పం మండలం కెంపసముద్రం ఉన్నత పాఠశాల విద్యార్థిని వాణిశ్రీ కడప జిల్లా ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ మంగళవారం తెలిపారు. వాణిశ్రీని ఆయనతో పాటు పలువురు ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలి

రామకుప్పం, ఆగస్టు 20: మండలంలోని సింగసముద్రం గ్రామంలో మంగళవారం విజలాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు దోమల వల్ల కలిగే అనారోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు మానవహారం చేపట్టారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లావణ్య, ఏఎన్ఎం అశ్వత, పలువురు ఎంపీహెచ్ఎస్ఎఫ్‌లు, ఆశా వర్కర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడుగుమాకులపల్లెలో పశువైద్య శిబిరం



శాంతిపురం, ఆగస్టు 20: మండలంలోని బడుగుమాకులపల్లెలో మంగళవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచు జయరాం ప్రారంభించారు. శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. పశువైద్యాధికారి సయ్యద్‌చాహతుల్లా, నేతలు రమేష్, శేఖర్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడి

పుంగనూరు రూరల్, ఆగస్టు20: పాత కక్షలతో ఓ వ్యక్తిపై దాడిచేసి గాయపరచడంతో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం దాసార్లపల్లెకు చెందిన శేఖర్‌పై మంగళవారం ఉదయం అదే గ్రామానికి చెందిన మంజు, రెడ్డెప్ప, కతార్లపల్లెకు చెందిన ఈశ్వర్ కలసి దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పల్స్ సర్వేని త్వరితగతిన పూర్తిచేయండి



శిక్షణను సందర్శించిన ఎస్ఈ విజయకుమార్

బైరెడ్డిపల్లె, ఆగస్టు 20 : జలజీవన్‌మిషన్‌లో భాగంగా గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న పల్స్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ విజయకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జరుగుతున్న శిక్షణా తరగతులను ఎస్ఈ సందర్శించారు. సర్వే పూర్తయిన తర్వాత జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రవికిరణ్, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఏఈ లోకనాథం, రిసోర్స్‌పర్సన్లు సద్గుణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మోడల్ మార్కెట్ స్థలం రీసర్వే



పలమనేరు, ఆగస్టు20 : పలమనేరు సమీపంలో నిర్మించనున్న మోడల్ మార్కెట్‌కు ఏపీవీవీయు నుంచి తీసుకొన్న 33 ఎకరాలను సోమవారం అధికారులు రీసర్వే చేయించారు. స్థలానికి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డీఈఈ హరి నారాయణరెడ్డి, పలమనేరు మార్కెట్‌యార్డు కార్యదర్శి సంజీవకుమార్, గంగవరం తహసీల్దార్ శివకుమార్, మండల సర్వేయర్ రవి పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



పలమనేరు, ఆగస్టు20 : పలమనేరు సమీపంలోని చిన్నూరు వద్ద వెలసిన రాఘవేంద్ర స్వామి ఆలయం వద్ద మంగళవారం 353వ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరణలు చేశారు. ఈ ఆరాధనోత్సవాలు 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఇక్కడి రాఘవేంద్ర సేవా సమితి నిర్వహిస్తోంది. 20వ తేదీ మంగళవారం పూర్వ ఆరాధన వైభవంగా నిర్వహించారు. 21న మధ్యఆరాధన, 22న గురువారం ఉత్తర ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

పలమనేరు, ఆగస్టు20 : పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద కౌండిన్యనది సమీపంలో గుణశేఖర్ నాయుడు, మంజునాథనాయుడు అనే రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్లను, కేబుళ్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. బాధిత రైతులు పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ అయిన మోటార్లు, కేబుళ్ల విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని రైతులు తెలిపారు. పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పలమనేరు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

దోమల నివారణ దినోత్సవ ర్యాలీ

సోమల, ఆగస్టు 20: ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా సోమలలో విద్యార్థులు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దోమ కాటుతో వ్యాపించే అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సోమల, పెద్ద ఉప్పరపల్లె వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, జయకుమార్, ప్రదీప్ కుమార్ రెడ్డి, పుంగనూరు మలేరియా సబ్‌యూనిట్ అధికారి గంగయ్య, అమరనాథ్, హెచ్ఎం హరినాథ్, పీడీ కరుణానిధి, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, ఆగస్టు 20: శాంతిపురం మండలం తుమ్మిశిలోని ఐటీఐలో ప్రవేశం కోసం పదవ తరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నగేష్ కోరారు. అభ్యర్థులు ఈ నెల 26లోగా ఐటీఐ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 27తేదీ దరఖాస్తు ఫారంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకోవాలని కోరారు. 29వ తేదీ ఉదయం 9గంటలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలియజేశారు.

దోమల నివారణపై అవగాహన



పుంగనూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పుంగనూరు రూరల్, ఆగస్టు20: దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక కొత్తపేట అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయేష్ అవగాహన కల్పించారు. మంగళవారం పట్టణంలోని కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల పరిధిలో వైద్యసిబ్బంది దోమల వల్ల కలిగే అనర్థాలతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ విజయచందర్, డాక్టర్ అరుణ్‌కుమార్, ఆరోగ్యవిద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ, వైద్యసిబ్బంది శ్రీదేవి, రాజారెడ్డి, అయూబ్‌ఖాన్, హరి ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో మౌలిక వసతుల పెంపు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

సోమల, ఆగస్టు 20: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు పెంచుతామని డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్ తెలిపారు. మంగళ వారం మండలంలోని గొల్లపల్లె వద్ద ఫారం పాండు, కందూరు సమీపంలో మినీ అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వేతన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెల వరకు 40లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 32.26 లక్షల రోజులు పని కల్పించామన్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణ పనులకు ఉపాధి కూలీలను వినియోగించుకోవచ్చని తెలిపారు. గ్రామసభల్లో ఉపాధి పథకంతో ఏయే పనులు అవసరమో గుర్తించి వెంటనే చేపట్టేలా చొరవ తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవోలు దినకర్‌బాబు, శివ, జ్యోతిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, శివశంకర్, జనార్ధన్, మల్లికార్జున, మహేంద్రబాబు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటన నిందితులను ఉరితీయాలి





రామకుప్పంలో కొవ్వొత్తులతో ర్యాలీ, వీకోటలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అఖిల పక్షం నేతలు

వి.కోట, ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటన నిందితులను ఉరితీయాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గణపతి కోరారు వి.కోటలో అఖిల పక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని పలువురు జూనియర్ డాక్టర్ల నేతృత్వంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, మహిళలు, కార్మికులు, పెద్ద ఎత్తున కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. పలు విద్యాసంస్థల విద్యార్థులు నిరసనలు చేపట్టారు.

రామకుప్పం: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రామకుప్పంలో కూటమి శ్రేణులు, వైద్యసిబ్బంది, పలు యువజన సంఘాలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. టీడీపీ నాయకులు వెంకటరమణ, డా.సాగర్‌రెడ్డి, సుబ్రీ, సతీష్, అవినాశ్, బ్రహ్మానందం, గిరి, ఆంజి, బీజేపీ నేతలు రాజసింహ, వెంకటేష్, చంద్ర, అప్పసామి, జనసేన నేతలు హరీష్, తంజిల్ తదితరులు పాల్గొన్నారు.



సత్య షోరూం ప్రారంభం

పుంగనూరు, ఆగస్టు 20: పుంగనూరులో సత్య ఏజెన్సీ వారి 29వ షోరూం ఏర్పాటైంది. సోమవారం భవన యజమాని మయూరి శ్రీనివాసులరెడ్డి రిబ్బన్ కత్తిరించి షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. సత్య ఏజెన్సీ ఆంధ్రప్రదేశ్ హెడ్ సెంథిల్, వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు సైతం పాల్గొన్నారు.



షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

ఏనుగుల దాడుల నిరోధానికి ప్రజలు సహకరించాలి



రైతులకు చెక్కులు అందజేస్తున్న అధికారులు, నేతలు

రామకుప్పం, ఆగస్టు 20: కుప్పం అటవీ క్షేత్ర పరిధిలో ఏనుగుల దాడుల నిరోధానికి అటవీ ప్రాంత ప్రజలు సహకరించాలని క్షేత్రాధికారి జయశంకర్ కోరారు. మండల పరిధిలో ఏనుగుల దాడుల్లో పంటనష్ట పోయిన 10మంది రైతులకు మంగళవారం వారు రామకుప్పంలో రూ.68000 విలువైన పంటనష్ట పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగులు పొలాల వద్దకు, జనావాసాల చేరువకు వస్తే వెంటనే స్థానిక అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తహసీల్దారు బాబు, రామకుప్పం అటవీ ఉపక్షేత్రాధికారి ధనుంజయుడు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, ఎంపీటీసీ వెంకట్రామగౌడు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం చల్లాబాబుకు వినతి



ప్రాజెక్టు ముంపు బాధితులు చల్లాబాబుకు వినతి

రొంపిచెర్ల, ఆగస్టు20: సదుం మండలం కొర్లకుంటవారిపల్లె సమీపంలో నిర్మించిన పెద్దవాగు ప్రాజెక్టు ముంపు భూముల రైతులకు పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కోరారు. మంగళవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన పీఎల్ఆర్ కంపెనీ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిందని 13 సంవత్సరాలుగా 23 మందికి పరిహారం అందించలేదన్నారు. తాము టీడీపీ వర్గీయులమని పరి హారం ఇవ్వలేదని వాపోయారు. అధికారులతో సంప్రదించి న్యాయం చేస్తానని చల్లాబాబు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర, బాలక్రిష్ణ, మురళీమోహన్, జయరామయ్య, నాగభూషణం, మునిరత్నం, కాంతమ్మ, నరసింహులు, అనుసూయ, రమేష్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు లేని క్లినిక్స్‌పై చర్యలు తప్పవు



కుప్పంలో హాస్పిటల్స్‌లో తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి హనుమంతరావు

కుప్పం, ఆగస్టు 20: జిల్లాలోని రిజిస్ట్రేషన్స్ లేని క్లినిక్స్‌పైనా, నిర్వాహకులపైనా చర్యలు తప్పవని జిల్లా నోడల్ అధికారి హనుమంతరావు హెచ్చరించారు. కుప్పంలోని ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లను, స్కానింగ్ సెంటర్లను మంగళవారం ఆయన, తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. కొన్ని క్లినిక్స్‌లో క్వాలిఫై కాని వైద్యులు సేవలందిస్తుండడం, ఆర్ఎంపీలు అన్ని రకాల వైద్యం చేస్తుండడం, కొన్ని క్లినిక్‌లకు అసలు రిజిస్ట్రేషన్ లేకపోవడాన్ని ఆయన గుర్తిం చారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, అలా కాకుండా అన్నిరకాల వైద్యం అందిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టప్రకారం నేరమని, ఇందుకు పాల్పడినవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ విషయంపై ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

గ్రామాల్లో వ్యర్థాలతో సంపద తయారు చేయాలి



వ్యర్థాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుడుపల్లె, ఆగస్టు 20: గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాలను సేకరించి ఎరువుగా తయారు చేసి పంచాయతీలకు ఆదాయం పెంపొందించాలని కుప్పం మండల విస్తరణ అధికారి విజయదత్ పేర్కొన్నారు. సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమంలో రెండవ రోజు మంగళవారం ఘన, ద్రవ వ్యర్థాల సేకరణపై అవగాహన కల్పించారు. సోడిగానిపల్లె ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద వ్యర్థాల నుంచి ఎరువు తయారీపై శిక్షణ అందించారు. ఇంటింటా పొడి, తడి చెత్తలను సేకరించి దాని నుండి సంపద తయారీ ఎలా చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్ మస్రూర్, శిక్షకులు నరసింహులు, ఈవోపీఆర్‌డీ శివశంకర్, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ భాస్కర్, సీనియర్ సహాయకులు సురేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వి.కోటలో కుండపోత వర్షం



వి.కోట, ఆగస్టు 20: వి.కోటలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురి సింది. ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. ఆపై మధ్యాహ్నం మొదలైన వర్షం సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. పట్టణంలోని వాడలన్నీ జలమయమయ్యాయి. భారత్‌నగర్ పూర్తిగా నీటమునిగింది. పట్టణంలోని ప్రధాన రహదారులు వాననీటితో నిండిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మూడు రోజులుగా వేడితో అల్లాడిన జనం ఈ వర్షంతో కాస్త ఊరట చెందారు. ఆర్టీసీ బస్టాండు బురదమయమైంది.

23న ఉపాధి హామీ గ్రామ సభలు

రొంపిచెర్ల, ఆగస్టు20: ఈ నెల 23వ తేదీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకం నిర్వహణపై గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు. ఈ గ్రామసభల్లో రైతులకు మంచి కలిగే పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ పరిధిలోని ప్రజలు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల,ఆగస్టు20: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని ఆంజనేయస్వామికి మంగళ వారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేయించారు. అభిషేకం, అర్చనలు చేశారు. పత్ర, పూలతో పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



కల్లూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

కల్లూరు, ఆగస్టు20: మండలంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలని అసిస్టెంట్ లేబర్ అధికారి అనందబాబు అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం ఆయన చైల్డ్ లేబర్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పనులలో పెట్టరాదని, వర్క్‌షాపులు, ఇటుకబట్టీలు, వ్యవసాయ పనులకు పంపరాదని సూచించారు. పనుల్లో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బడికి పంపాలని కోరారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

సోమల, ఆగస్టు 20: సోమలలోని పలు వీధుల్లో రాత్రి పూట వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి పూట వీధి కుక్కలు వీధుల్లో విహరిస్తూ బాటసారులపై దాడులు చేస్తున్నాయి. శెట్టివారివీధి, సాయిబాబా గుడి వీధుల్లో వీధిదీపాలను బాగుచేయాలని స్థానికులు సచివాలయ అధికారులను కోరినా పట్టించు కోలేదని మహిళలు వాపోయారు.

తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ సన్మానం

సోమల, ఆగస్టు 20: సోమల తహసీల్దార్ బెన్నిరాజ్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళి మాట్లాడుతూ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామనాథం, మొగిలీశ్వర్, ప్రకాశ్, వెంకట్రామయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ఇంటింటి సర్వే



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

సోమల, ఆగస్టు 20: ఓటరు నమోదుకు బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి నమోదు చేపట్టాలని తహసీల్దార్ బెన్నిరాజ్ తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 జనవరి 1నాటికి 18ఏళ్లు నిండనున్న యువతీ యువకులను ఓటరుగా నమోదు చేయా లన్నారు. పాత ఓటరు జాబితాలో సవరణలు కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీటీ రామ్మూర్తి, ఆర్ఐలు మహేశ్, సుబుక్తుల్లా, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బీజేపీ ఫ్లెక్సీ చించివేత.. పోలీసులకు ఫిర్యాదు



సోమల, ఆగస్టు 20: మండలంలోని పెద్ద ఉప్పర పల్లె బస్టాండ్ కూడలిలో బీజేపీ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చించి వేశారు. ఫ్లెక్సీలో ప్రధాని మోదీ ఫొటోను కత్తరించడంతో పుంగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జి గన్నా మదన్ మోహన్‌బాబు, బీజేపీ కార్యకర్తలు సోమల పోలీసులకు, పుంగనూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నేరాల అడ్డుకట్టకు అవగాహన అవసరం

చిత్తూరు, ఆగస్టు 20: సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహనతో ఉండాలని రెండో పట్టణ సీఐ నెట్టికంతయ్య అన్నారు. మంగళవారం బృందావనం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో గంజాయి, సైబర్ నేరాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు రోజూ ప్రజలు మోసపోతున్నారని, అలాంటి వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. గంజాయి వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందన్నారు.

గుండెపోటుతో ఏఎన్ఎం మృతి


భూషణ (ఫైల్‌ఫొటో)

యాదమరి, ఆగస్టు 20: మండలంలోని సిద్దారెడ్డిపల్లె సచివాలయ ఏఎన్ఎంగా పనిచేస్తున్న భూషణ(44) మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆమెను బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమె మృతిపై ఎంపీడీవో శివరాజ్, పీహెచ్‌సీ సిబ్బంది సానుభూతి తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, ఆగస్టు 20: మండలంలోని మహారాజపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పెన్నులు, పెన్సిల్, నోటుపుస్తకాలు వితరణగా అందించారు. విద్యాకమిటీ చైర్మన్ జయంతి, హెచ్ఎం సుష్మ, మాజీ ఎంపీటీసీ రాజమ్మ పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం

విజయపురం, ఆగస్టు 20: విజయపురం ఎస్ఐ జయప్పను మంగళవారం డీఎస్పీ నరసింహమూర్తి ఘనంగా సత్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా చూసినందుకు అభినందించారు. ఆయన బదిలీపై కర్నూలు వెళుతున్నట్టు తెలిపారు. సీఐ సుబ్బురామిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పూతలపట్టు, ఆగస్టు 20: కోల్‌కతా డాక్టర్ హత్యాచార కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని పూతలపట్టు వైద్యాధికారులు, సిబ్బంది కోరారు. మంగళవారం ఎంఈవో కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిందితులకు శిక్షపడేలా పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ చొరవ చూపాలని కోరారు.

18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలి

గుడిపాల, ఆగస్టు 20: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్వోలతో ఆయన సమావేశమయ్యారు. బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉంటే తొలగించడం వంటివి చేపట్టాలన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

నగరి, ఆగస్టు 20 : నగరి మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లేఅవుట్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ మంజునాథ్‌గౌడ్ హెచ్చరించారు. అనధికారిక లేఅవుట్లలో నిర్మాణాలకు, రోడ్డు, విద్యుత్, నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించేది లేదన్నారు. సదయప్పనగర్ ఎక్స్‌టెన్షన్, బంగారు కన్నియప్పనగర్, వీజీకేఎస్ లేఅవుట్, ఏఎంఎల్‌సీ బ్రదర్ లేఅవుట్, వీజీఎస్‌నగర్, మారుతీనగర్ లేఅవుట్, శ్రీనగర్ లేఅవుట్, శ్రీకృష్ణానగర్ లేఅవుట్, కాకవేడు తదితర ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లను గుర్తించినట్లు తెలిపారు. ఈ లేఅవుట్లలో ప్లాట్ల కొనుగోలు చట్ట విరుద్ధమని, అవి రిజిస్ట్రేషన్ కావని చెప్పారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

పెనుమూరు, ఆగస్టు 20: గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. పంచాయతీలో అభివృద్ధి పనులపై అందరి అభిప్రాయాలను సేకరించి గ్రామ సభల్లో తీర్మానం చేయాలని సూచించారు.

నేటి బంద్‌ను జయప్రదం చేయండి

వెదురుకుప్పం, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ మాలమహానాడు జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకులు చలపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 20: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పరిసర గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. రాహుకాల పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వెదురుకుప్పం, ఆగస్టు 20: కార్వేటినగరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు కేకంద్రిగకు చెందిన శైలజ, కీర్తి, ఎం.కిషోర్ యాదవ్ వితరణతో మంగళవారం అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లు అందజేశారు. వృద్ధాశ్రమానికి తమవంతు సహకారం అందిస్తామని కిషోర్ యాదవ్ తెలిపారు.

ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు సన్మానం



నగరి, ఆగస్టు 20: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను నగరి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తిరుపతిలో ఆయన స్వగృహం వద్ద సన్మానించారు. అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రామచంద్రన్, జి.గుణశేఖర్, జ్యోతినాయుడు, మనోహర్‌నాయుడు, రాజశేఖర్, కేవీ సోము, కుప్పయ్య, సుబ్రమణ్యం, గోపి, మణి, భూపతి జయరామ్ పాల్గొన్నారు.

పెనుమూరుకు ఎస్ఐ కావలెను

పెనుమూరు, ఆగస్టు 20: మండలానికి ఎస్ఐ లేకపోవడంతో చిన్న చిన్న సమస్యలకు కూడా చిత్తూరుకు వెళ్లాల్సి వస్తోంది. నెల రోజులుగా ఎస్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇక్కడి సిబ్బంది ఫిర్యాదుదారులకు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇక్కడ ఎస్ఐగా ఉన్న లోకేష్‌పై ఆరోపణలు రావడంతో ఆయన్ను గత నెల వీఆర్‌కు పంపిన విషయం విదితమే. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉండడంతో మండలంలో భూ సమస్యలపై రోజూ ఫిర్యాదులు వస్తున్నాయని, శాంతిభద్రతలు లోపిస్తునా యని, ఎస్పీ శ్రద్ధ వహించి త్వరగా ఎస్ఐను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జీవో 117ను రద్దు చేయించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 20: విద్యా వ్యవస్థకు నష్టం చేకూర్చే జీవో 117ను రద్దు చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జీవో రద్దు తాత్కాలిక సర్దుబాటు చేయాలని, తల్లికి వందనం ప్రభుత్వ బడుల్లోని వారికి వర్తింపజేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఏపీటీఎఫ్ నాయకులు ముక్తార్, జగదీష్, అఫ్జల్, లక్ష్మీపతి ఉన్నారు. ● టీచర్ల సర్దుబాటులోని అసంబద్ధ నిబంధనలు తొలగించాలని కోరుతూ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ మంగళవారం డీఈవో దేవరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్జీటీలను, భాష పండితులను అదే పాఠశాలలో కొనసాగించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్టీయూ నాయకులు దేవరాజులు, గణపతి, చంద్రన్, కమలావతి, గోపి, హిమబిందు తదితరులు ఉన్నారు.

ఇంట్లో పేలిన సిలిండర్ : రూ.లక్ష ఆస్తి నష్టం


ఇంట్లో కాలిపోయిన వస్తువులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 20: అంగన్‌వాడీ టీచర్ ఇంట్లో సిలిండర్ పేలి, మంటలు చెలరేగాయి. రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన మండలంలోని రాఘవ రాజపురం దళితవాడలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అంగన్‌వాడీ టీచర్ రెడ్డెమ్మ కుమార్తె దీప గ్యాస్‌పై పాలు పెట్టి పక్కింటికి వెళ్లింది. కొంతసేపటికి సిలిండర్ పేలిన శబ్దం రావడంతో పరుగున వచ్చింది. అప్పటికే ఇంట్లో పొగ, మంటలు అలముకున్నాయి. గ్రామస్తుల సహాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే బీరువా, 25వేల రూపాయలు డబ్బులు, నిత్యావసర వస్తువులు, పట్టాదారు పాసుపుస్తకం కాలిపోయాయి. రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు. తహసీల్దార్ అమర్నానాథ్, ఎంపీడీవో మోహన్‌మురళి, ఎస్ఐ కుళాయిప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

నెలాఖరులోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలి

చిత్తూరు రూరల్, ఆగస్టు 20: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలో 2021 వరకు పెండింగ్‌లో వర్క్ ఆర్డర్లను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం గాంధీ రోడ్డులోని చిత్తూరు అర్బన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చాలా మంది ఏఈలు వర్క్ ఆర్డర్లు పూర్తి చేయకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టారన్నారు. 450 వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. లేని పక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బిల్లు కలెక్షన్లు వేగవంతం చేయాలన్నారు. ప్రతినెలా 7వ తేదీలోపు బిల్లింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ ఏవో రమణయ్య, డీఈలు శేషాద్రి, పద్మనాభపిళ్లై, జ్ఞానేశ్వర్, ఏఈలు పాల్గొన్నారు.

కాణిపాకం బ్రహ్మోత్సవాలపై 27న సమావేశం


కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో వాణి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 20: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఈనెల 27న కాణిపాకంలో సమావేశం ఉంటుందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆలయ నూతన ఈవో వాణి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, ఆలయ అర్చక, వేదపండితులతో ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఈవో మాట్లాడుతూ సెప్టెంబరు 7 నుంచి 27వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక బ్రహ్మోత్సవాలు నిర్వహించడంపై ఉభయదారులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులను కూడా ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆలయ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు



గుడిపాల, ఆగస్టు 20: పేదల ఆకలి తీర్చడానికే ప్రభుత్వం అన్న క్యాంటీన్లు పెట్టిందని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు అన్నారు. మంగళవారం బాలాజీ నాయుడు కుమారుడి జన్మదినం సందర్భంగా భోజన వితరణ చేశారు. మాజీ ఎంపీపీ నాగరాజ్ యాదవ్, బీజేపీ మండలా ధ్యక్షుడు ధనుంజయ నాయుడు, టీడీపీ నాయకులు గుర్రప్ప నాయుడు, కిట్టు, చిట్టి యాదవ్, ఆనంద్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

గుడిపాల, ఆగస్టు 20: మండలంలోని పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో విద్యార్థి అదృశ్యం ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. పెరుమాళ్ కుమారుడు రేణుకుమార్ అలియాస్ విక్కీకి మతిస్థిమితం లేదు. రెండ్రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన బాలుడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం గుడిపాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించండి

బంగారుపాళ్యం, ఆగస్టు 20: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పక వేయించాలని పశుసంవర్థకశాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. మంగళవారం సంక్రాంతిపల్లి పశువైద్య కేంద్రంలో గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణకు టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని, నాలుగు నుంచి ఎనిమిది నెలల వయస్సు గల పేయ దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయాలన్నారు. వచ్చే నెల 18వ తేదీ వరకు ఈ టీకాల కార్యక్రమం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సర్పంచ్ రమేష్, ఉప సంచాలకులు ఆరీఫ్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్బమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆసిఫ్, నలగాంపల్లి పశువైద్యాధికారిణి డాక్టర్ ఝాన్సీ, సంక్రాంతిపల్లి ఏఈవో నాగేంద్ర నాయక్ పాల్గొన్నారు.

ఖాజీగా ఎవరినీ నియమించలేదు

చిత్తూరు, ఆగస్టు 20: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి నాయబ్ ఖాజీగా ఎవరినీ నియమించలేదని మైనార్టీ సంక్షేమాధికారి చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇమ్రాన్‌ను నియోజకవర్గ ఖాజీగా నియమించినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలో నిజం లేదన్నారు. మసీదు కమిటీ సభ్యులు, మత పెద్దలు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

ముందస్తు ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 20: ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకుంటే పంచాయతీలను సులువుగా అభివృద్ధి చేసుకోవచ్చునని ఎన్ఐఆర్‌డీ అబ్జర్వర్ ప్రసాద్ అన్నారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయం, పెద్దకాల్వ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లో సర్పంచ్‌ల, కార్యదర్శుల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన పొరబాట్లను సరిదిద్దుకుంటూ కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

వెదురుకుప్పం : ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్ తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణ, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, గ్రామ పంచాయతీల పరిపాలన, గ్రామ పంచాయతీల అధికారాలు, విధులపై శిక్షణ ఇస్తారని, దీన్ని గ్రామ పంచాయతీల్లో అమలు పరచాలన్నారు.

విజయపురం : పంచాయతీలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై మంగళవారం ఈవోపీఆర్డీ సురేంద్రకుమార్ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పారిశుధ్యం, గ్రామ సభలు, గ్రామ అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి


రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద కాంగ్రెస్ నేతల నివాళి

నగరి, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి వేడుకలను నగరి టవర్‌క్లాక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. పీసీసీ మెంబర్లు నటరాజ మొదలియార్, చిరంజీవిరెడ్డి, జిల్లా కార్యదర్శులు దేశయ్య, అల్లాపిచ్చి, నాయకులు కుమార్, నాగేశ్వరరావు, గోపాల్, వెంకట్ గుణ, విజయ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



నగరి, ఆగస్టు 20 : నగరి మండల పరిధిలోని గుండ్రాజకుప్పం దళితవాడ ప్రాథమిక పాఠశాలలో 97 మంది పిల్లలకు జి.ప్రతాప్ నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు తోచిన సాయం చేయాలన్న దృక్పథంతో నోట్ పుస్తకాలు ఇచ్చినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు శివశంకర్, కృష్ణయ్య, వెంకటేశులు, శశిధర్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగు ఆవుల అపహరణ

చిత్తూరు, ఆగస్టు 20: నగరంలో సోమవారం రాత్రి నాలుగు ఆవులు అపహరణకు గురయ్యాయి. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని సత్యనారాయణపురానికి చెందిన పద్మనాభన్, మైత్రి పాడి ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి యథాప్రకారం ఆవులను ఇంటి వద్ద కట్టేశారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇద్దరి ఇళ్ల నుంచి రెండేసి చొప్పున నాలుగు ఆవులను పట్టుకెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


పుష్పాలంకారంలో స్వామివారు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 20: నగరంలోని గిరింపేట సుగుణేంద్రస్వామి తీర్థ మూల సన్నిధానంలో మంగళవారం రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. అష్టోత్తర పారాయణం, అభిషేకాలు, అర్చన, హస్తోదకం, భజన, మహా మంగళహారతి నిర్వహించారు. బ్రాహ్మణవీధి భీమారావు సత్రంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలోనూ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

భక్తి భగవత్ ప్రేరితం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 20: భక్తి అనేది భగవత్ ప్రేరితమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రేయానంద సరస్వతి చిన్మాయానంద అన్నారు. నగరంలోని వేలూరు రోడ్డు సద్గురు సేవా ఆశ్రయంలో మూడు రోజులుగా ఆమె గీతాజ్ఞాన యోగం ప్రవచనం నిర్వహిస్తున్నారు. ప్రతి వ్యక్తిలోనూ అంతర్లీనంగా భక్తి ఉంటుందని, అది నడవడికకు మార్గం చూపిస్తుందని అన్నారు. జీవరాశుల్లో క్రమశిక్షణ అనేది అంతర్లీనంగా ఉంటుందని, దాని ద్వారా జీవన యానం చేస్తాయని పేర్కొన్నారు. పరబ్రహ్మస్వామి, కేశవులు, రఘుపతి, బాబునాయుడు పాల్గొన్నారు.

జిలెటిన్ స్టిక్స్ కేసులో మరొకరి అరెస్టు

చిత్తూరు, ఆగస్టు 20: జిలెటిన్ స్టిక్స్ సరఫరా కేసులో తమిళనాడుకు చెందిన శివాజీని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని బోడికొండ సమీపంలో 76 జిలెటిన్ స్టిక్స్ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో రెండో పట్టణ పోలీసులు వెళ్లి గోవిందన్, రమేష్‌లను అరెస్టు చేసిన విషయం విదితమే. వీరికి సరఫరా చేసిన శివాజీ పరారయ్యాడు. మంగళవారం పోలీసులు అతన్ని పట్టుకుని రిమాండ్ పంపించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

యాదమరి, ఆగస్టు 20: కోర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ అంటే మీకు తెలుసా అనే కార్యక్రమాన్ని స్థానిక విద్య జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. సంస్థ ఓఆర్‌డబ్ల్యూ ద్రాక్షాయణి ఎయిడ్స్ ఎలా వస్తుంది.. రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సత్యసాయి సంస్థాన్‌లో వరలక్ష్మీ వ్రతం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 20: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఈ నెల 26వ తేదీన వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నామని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన వారు కల్పనాశంకర్ (8333803077), వాసవి (8019210510)లను సంప్రదించాలని పేర్కొన్నారు.

23న ఉపాధి పనులపై గ్రామసభలు

వెదురుకుప్పం, ఆగస్టు 20: ఉపాధి హామీ పనుల మంజూరు కోసం ఈనెల 23న మండలంలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఏవో కె.హరినాథ్‌బాబు, ఏపీవో ఇందు మంగళవారం తెలిపారు. ఏవో కె.హరినాథ్‌బాబు, వ్యవసాయాధికారిణి సి.వనిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ తిమ్మరాజు, పంచాయతీరాజ్ ఏఈ మురళి, ఈవోపీఆర్డీ పురుషోత్తం, ఉపాధి హామీ పథకం జేఈ మునిరత్నం, ఏపీవో ఇందు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తారని చెప్పారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

పాలసముద్రం, ఆగస్టు 20: దోమల నివారణకు కలసికట్టుగా చర్యలు తీసుకోవాలని డాక్టర్ మోహనకృష్ణ కోరారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి బీసీ కాలనీ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమ చిన్నది వ్యాధి పెద్దది, దోమల నిర్మూలన మనందరి బాధ్యత, దోమ కాటు ఆరోగ్యానికి చేటు, దోమలను నిర్మూలిద్దాం, కుట్టకుండా చూద్దామంటూ నినాదాలు చేశారు.

యాదమరి : దోమల రహిత సమాజమే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ సురేఖ అన్నారు. సంతగేటు గ్రామంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని స్థాపించవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారమూ డ్రై డేని పాటించాలన్నారు.

శ్రీరంగరాజపురం : దోమలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఆర్‌పురం ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్లు గిరి, బాల సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరిమాకులపల్లె ప్రాథమిక ఆర్యోగ కేంద్రంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం ర్యాలీ నిర్వ హించారు. సీహెచ్ మునస్వామి, సూపర్‌వైజర్ గంగాభవాని, టెక్నీషియన్ పద్మజ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత కళాశాల విద్యార్థులతో కలసి ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ సురేఖ వివరించారు.


పాలసముద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ


ఎస్ఆర్‌పురంలో..